9

సాక్షి నిర్మల్

బుధవారం । 25 । డిసెంబర్ । 2024

ఎగ్జిబిషన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో నుమాయిష్ (ఎగ్జిబిషన్) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎగ్జిబిషన్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. జనవరి 5నుంచి 7వరకు ఉదయం 9నుంచి సాయంత్రం 7గంటల వరకు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లాలో మొట్టమొదటిసారిగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో హస్తకళలు, పెయింటింగ్స్, చేతివృత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, మహిళా స్వయం సంఘాల ఉత్పత్తులు, పుస్తకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పేర్లు నమోదు చేసుకోవాలని, జిల్లా చరిత్ర తెలిపేలా సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రముఖులందరినీ కార్యక్రమానికి ఆహ్వానించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రామారావు, డీవైఎస్వో శ్రీకాంత్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, డీఎస్వో కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిషం చెప్పించుకుని నిరసన



జ్యోతిష్యం చెప్పించుకుంటున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: డిమాండ్లు నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్ష కొనసాగిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. దీక్ష శిబిరానికి జ్యోతిష్యుడిని పిలిపించుకుని జ్యోతిషం చెప్పించుకున్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, రమణారావు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దీక్ష శిబిరాన్ని సందర్శించారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు మహేశ్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఈనెల 27వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు జిల్లా విద్యాధికారి రామారావుకు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు లేఖ అందజేశారు. దీక్ష శిబిరంలో నాయకులు గజేందర్, నవిత, లక్ష్మి, నరేశ్, రజిత, ఆనంద్, రమణ, నర్సయ్య, విజయ్ తదితరులు కూర్చున్నారు.

లక్ష్మణచాంద: ఈ నెల 27వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో సమ్మెకు వెళ్తున్నట్లు సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది జిల్లా విద్యాధికారి రామారావుకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని 15రోజులుగా నిరవధిక దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదని తెలిపారు. దీంతో సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న మొత్తం సిబ్బందితో పూర్తిగా సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. ఇక కేజీబీవీలు, యూఆర్ఎస్‌లకు ఎవరమూ వెళ్లబోమని పేర్కొన్నారు.



జిల్లా కేంద్రంలోని పురాతన సీఎస్సై చర్చి

చర్చీలు ముస్తాబు

నేడు నిర్వహించనున్న క్రిస్మస్ పండుగకు జిల్లాలోని చర్చీలు ఇప్పటికే ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీపాలతో వెలిగిపోతున్నాయి. చర్చీల వద్ద నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీల ఆకృతులు ఆకర్షిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని గాజులపేటలో గల పురాతన సీఎస్ఐ, వెంకటాపూర్‌లోగల అతిపెద్ద నిస్సితోపాటు సెయింట్ థామస్, గొల్లపేట్ తదితర చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. – నిర్మల్‌టౌన్



చావరా క్యాథలిక్ చర్చి



సీఎస్సై చర్చిలో పశువుల పాక

హామీలు అమలు చేయాలని సీఎంకు లేఖ

నిర్మల్‌చైన్‌గేట్: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగ లేఖను బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మెకు దిగారని లేఖలో పేర్కొన్నారు. అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి వారికి సంఘీభావం తెలిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. ఎన్నికల్లో 420 హామీలిచ్చి ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో నిరసన కార్యక్రమాలు చేపడతామని సీఎంకు రాసిన లేఖలో మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

మహాసభలను జయప్రదం చేయాలి



కరపత్రాలు పంచుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: సంగారెడ్డి జిల్లాలో జనవరి 25నుంచి 28వరకు నిర్వహించనున్న తెలంగాణ సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ పట్టణ కార్యదర్శి తుడ సంశంబు కోరారు. సీపీఎం నిర్మల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగవారం 'ఇంటింటికీ సీపీఎం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంశంబు మాట్లాడుతూ.. పేదలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీగా సీపీఎం గుర్తింపు పొందిందని చెప్పారు. మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు పోశెట్టి, ఫసియొద్దీన్, నాయకులు ఉయిక భీమ్‌రావు, పంద్రం ఆనంద్‌రావు, సోయం సూర్యభాన్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ముథోల్: మత్తు పదార్థాలు తీసుకుని జీవితం నాశనం చేసుకోవద్దని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి సూచించారు. మండల కేంద్రంలోని రవీంద్ర పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి వివరించారు. మాదకద్రవ్యాలను నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. కరస్పాండెంట్ రాజేందర్, ప్రిన్సిపాల్ సాయినాథ్, ఉపాధ్యాయులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



విద్యార్థులతో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. ఈనెల 27న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులను మంగళవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అభినందించారు. జిల్లా నుంచి 550 మంది రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టీషర్ట్‌లు, క్యాప్‌లు అందజేశారు. జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, పీఈటీల సెక్రటరీ భోజన, పీడీ భూమన్న తదితరులున్నారు.

హక్కులపై అవగాహన కల్పించాలి

నిర్మల్‌చైన్‌గేట్: వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ వినియోగదారునికి హక్కులు, చట్టాలు, న్యాయపరమైన వివరాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. కొన్న ప్రతీ వస్తువుకు రశీదు పొందడం తప్పనిసరి అని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్, రేషన్ డీలర్లు, వ్యాపారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు

నిర్మల్‌చైన్‌గేట్: సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో సేంద్రియ పదార్థాల చిరు ఆహార కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సేంద్రియ ఉత్పత్తులతో తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్‌ను జిల్లా అధికారులు, సిబ్బంది, సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా అధికారులతో కలిసి ఆహార పదార్థాల రుచి చూశారు. డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్వో కిరణ్‌కుమార్, డీపీవో అంజిప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ ఉన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో గల్ఫ్ కార్మికుడు మృతి

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు గుగ్లావత్ గణేశ్ (38) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పది నెలల క్రితం అప్పులు చేసి ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లిన గణేశ్ అనారోగ్యానికి గురికావడంతో ఈనెల 18న స్వదేశానికి తిరిగివచ్చాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల, కుమారుడు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఆగిఉన్న లారీని ఢీకొని ఒకరు మృతి

భైంసారూరల్: ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మాలిక్ తెలిపిన వివరాల మేరకు కుంటాల మండలంలోని ఓల గ్రామానికి చెందిన బొంతల గంగాప్రసాద్ (36) సోమవారం రాత్రి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై భైంసాకు వచ్చాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మాటేగాం సమీపంలోని టోల్ ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య గీతిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మోటారు దించేందుకు వెళ్లి వ్యక్తి మృతి

లోకేశ్వరం: వాగులో మోటారు దింపడానికి వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన పడాల నర్సయ్య(42) మంగళవారం కన్కపూర్ శివారు ప్రాంతంలోని వాగులో అదే గ్రామానికి చెందిన తోట గంగాధర్‌కు చెందిన విద్యుత్ మోటారు దింపేందుకు వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. జాలర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య సాయవ్వ, కుమారుడు, కుమారై ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసరలో లక్ష దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో మంగళవారం మెదక్ జిల్లా ఆత్మానంద్ ఆశ్రమ వ్యవస్థాపకులు రాజయోగి వెంకటస్వామి ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ వైదిక, పరిపాలన సిబ్బంది స్వామివారి శిష్య బృందం ఆధ్వర్యంలో స్వామీజీకి ఘనస్వాగతం పలికారు.

రక్షణోదయం.. క్రీస్తు జననం



యేసు అంటే రక్షణ.. యేసు జననమే రక్షణోదయం. అదే క్రిస్మస్. రక్షణకు పుట్టినరోజు. ఆ రక్షణ కార్యానికి పుట్టిన క్రీస్తును ఆరాధించడమే క్రిస్మస్. బుధవారం (డిసెంబర్ 25) క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు జరుపుకోనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. క్రిస్మస్ సందర్భంగా పురాతన చర్చిలపై ప్రత్యేక కథనం.

బెల్లంపల్లి చర్చికి 70 ఏళ్లు



బెల్లంపల్లిలోని సీఎస్ఐ చర్చి

బెల్లంపల్లి: 1927లో బొగ్గు గనుల తవ్వకాలు ప్రారంభమయ్యాయి. 1954 ఫిబ్రవరి 21న ఇంగ్లాండ్‌కు చెందిన రెవ డాక్టర్ డబ్ల్యూఈ సంగస్టర్ చర్చి నిర్మాణానికి భూమిపూజ చేయగా 1958లో రెవ.నోయల్ బ్రూయిస్ మిషనరీగా వచ్చి ప్రారంభోత్సవం చేశారు. క్రైస్తవుల వివాహ వేడుకలకు సీఎస్ఐ చర్చి ఎంతగానో ప్రసిద్ధిగాంచింది. ఇందులో వివాహం చేసుకున్న దంపతులు ఆయురారోగ్యాలతో సంసార జీవనం సాగిస్తారనే విశ్వాసం సమాజంలో ఉంది.

మిషన్ చర్చికి 51 ఏళ్ల చరిత్ర



ముస్తాబైన క్రిస్టియన్ మిషన్ చర్చి

చెన్నూర్: పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో ఐఈఎం, క్రిస్టియన్ మిషన్ చర్చిని 1974లో పాస్టర్లు డానియాల్, ఆనందరావు, తంబిరాజు ఆధ్వర్యంలో నిర్మించగా నేటికి 51 ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రతీ ఆదివారం చర్చిలో వందలాది మంది ప్రార్థనలు చేస్తారు. క్రిస్మస్‌కు రెండు రోజుల ముందు నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయని పాస్టర్ సత్యరాజ్ తెలిపారు.

చరిత్రకు సజీవ సాక్ష్యం 'సీఎస్ఐ'

- రాష్ట్రంలో రెండో అతిపెద్ద చర్చి
- 89 వసంతాలు పూర్తి

లక్సెట్టిపేట(మంచిర్యాల): తెలంగాణలో మెదక్ తర్వాత రెండో అతిపెద్ద చర్చిగా లక్సెట్టిపేటలోని సీఎస్ఐ చర్చికి గుర్తింపు ఉంది. చారిత్రక కట్టాడలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. చర్చి నిర్మించి 89 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఏటా క్రిస్‌మస్‌కు భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రార్థనలు చేస్తారు.

చర్చి వివరాలు

లక్సెట్టిపేటకు రెండు కిలోమీటర్ల దూరంలో సీఎస్ఐ ప్రదేశంలో వందకు పైగా ఎకరాల్లో మిషన్ కాంపౌండ్ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించారు. 1920లో ఇంగ్లాండ్‌కు చెందిన రెవ ఈడబ్ల్యూలాంట్ లక్సెట్టిపేటకు వచ్చి మిషనరీ సంస్థలో పదేళ్లపాటు మిషనరీగా పనిచేశాడు. అతను ఏసుక్రీస్తును ఆరాధించేవాడు. ఇక్కడ చర్చి నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. ఇంగ్లాండ్ నుంచి ప్లాన్ తెప్పించాడు. 95 ఫీట్ల వైశాల్యం, 45 ఫీట్ల వెడల్పు, ప్రాంగణ వైశాల్యం 70 ఫీట్లు, సుమారు 500 మందికి వసతి



విద్యుత్ కాంతుల్లో మిషన్ కాంపౌండ్‌లోని సీఎస్ఐ చర్చి

కల్పించేలా 1930లో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఇంగ్లాండ్ నుంచి రంగుల అద్దాలు, గూడెం గుట్ట, గువ్వల గుట్ట, చిన్నయ్య గుట్టల నుంచి రాళ్లు తెప్పించి నిర్మాణానికి ఉపయోగించారు. మహారాష్ట్ర నుంచి శిల్ప కళాకారులను రప్పించారు. 1935లో పనులు పూర్తి చేయించారు. మిషనరీగా వచ్చిన రెవ ఫాస్పూట్ సీఎస్ఐ చర్చిగా నామకరణం చేసి 1935 డిసెంబర్ 25 క్రిస్‌మస్ రోజున చర్చిని ప్రారంభించారు. అప్పటి నుంచి 1954 వరకు ఆంగ్లేయులు ఫాదర్‌లుగా విధులు నిర్వహించారు. వారి కోసం అందమైన బంగ్లా నిర్మించుకున్నారు.

క్రీస్తురాజు దేవాలయం



ముస్తాబైన క్రీస్తురాజు దేవాలయం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని క్రీస్తురాజు దేవాలయం క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. అతిపురాతన చర్చిల్లో క్రీస్తురాజు దే వాలయం ఒకటి. ఈ చర్చిని 1968లో నిర్మించారు.

ఈ చర్చికి 62 ఏళ్లు



ముస్తాబైన చర్చి

కౌటాల: మండలంలోని విజయనగరం గ్రామంలో ఉన్న కతోలిక చర్చికి 62 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. 1962లో ఈ చర్చిని నిర్మించారు. గ్రామంలో అన్నీ క్రైస్తవ కుటుంబాలే ఉండడం విశేషం. చర్చి చుట్టూ అందమైన గార్డెన్ ఏర్పాటు చేసి అందులో రకరకాల మొక్కలను పెంచారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆహ్లాదంతో నిండుకుంది. 34 ఏళ్ల క్రితం పాత భవనాన్ని తొలగించి అదే స్థలంలో భారీ మందిరం నిర్మించారు. నేడు చర్చిలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఫాదర్ సీజో పేర్కొన్నారు.

భైంసాలో కిలాడీ జంట అరెస్ట్

భైంసాటౌన్(ముధోల్): జల్సాలకు అలవాటు పడి వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ జంటను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఏఎస్పీ అవినాష్ కుమార్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన పులి ప్రదీప్, కొడాలి వెంకటలక్ష్మితో కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని చోరీలకు పాలప్పడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 22న రాత్రి ఒంటిగంటకు భైంసా నుంచి కారులో వెళ్లి కుభీర్ మండలం పార్డి (బి)లోని రాజరాజేశ్వర ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు అపహరించారు. అనంతరం అదేరోజు ఉదయం 4 గంటల ప్రాంతంలో చొండిలోని దత్తసాయి ఆలయంలో చోరీకి యత్నించగా ఏం లభించకపోవడంతో ఆలయ ఆవరణలో ఉన్న గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లారు. అక్కడి నుంచి కారులో మహారాష్ట్రకు వెళ్లి దొంగిలించిన సొత్తుతో



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

జల్సా చేసి తిరిగి భైంసా వస్తుండగా కుభీర్ శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా గతంలో కుభీర్, భైంసా, ముధోల్, బాసర, నర్సాపూర్ (జి)లో చోరీలకు పాల్పడినట్లు తేలడంతో రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.10,910 నగదు, కారు, రెండు ఫోన్లు, పుస్తెలు, కాళ్ల పట్టీలు, చెవి రింగులు, గ్యాస్ సిలిండర్, పగులగొట్టిన తాళాలు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో రూరల్ సీఐ నైలు, ఎస్సైలు రవీందర్, ఎండీ గౌసుద్దీన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో సుడిగాలి పర్యటన

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం గాదిగూడ మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఝరి ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, వంటగది పరిశీలించి సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ రాంకిషన్‌ను బదిలీ చేసి షోకాజ్ నోటీసు జారీ చేశారు. నాణ్యమైన సరుకులు సరఫరా చేయడంలేదని జీసీసీ మేనేజర్ చందూలాల్‌పై బదిలీ వేటు వేశారు. గాదిగూడ మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఎన్ఎంను విధుల్లోంచి తొలగించారు. రికార్డులు సరిగా లేకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు రామారావుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. చిత్తగూడలో రిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆమె వెంట జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, అదనపు జిల్లా వైద్యాధికారి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

బాసరలో మహిళా విశ్వవిద్యాలయ వీసీ పూజలు



పూజలు చేస్తున్న ప్రొఫెసర్ సూర్యాధనుంజయ్

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారిని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యాధనుంజయ్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపించారు. తర్వాత పండితులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ప్రొఫెసర్ వెంట వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత కమిషనర్, ప్రస్తుత హైకోర్టు న్యాయవాది డాక్టర్ ధనుంజయ్ నాయక్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఇన్‌స్ట్రక్టర్ డాక్టర్ రవితేజ, కవి, విమర్శకులు డాక్టర్ మంత్రి శ్రీనివాస్ ఉన్నారు.

యువకుడికి పోలీసుల కౌన్సెలింగ్

తానూరు: మండలంలోని హిప్నెల్లితండాకు చెందిన పవార్ వికాష్ మంగళవారం ఉదయం భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎస్సై రమేశ్‌కు సమాచారం అందించడంతో అతన్ని వెతికి పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్య చేసుకుంటే కుటుంబాలు రోడ్డున పడుతాయని, పిల్లలు అనాథలుగా మారుతారన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

ఉట్నూర్‌రూరల్: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన షేక్ మోయిన్, షేక్ సాజిద్, సిండే రాజా సోమవారం ఉట్నూర్‌లోని బోయవాడకాలనీలో రమేశ్‌కు చెందిన ఇంట్లో చోరీకి యత్నించారు. సీసీపుటేజీ ఆధారంగా మంగళవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 2.1 తులాల బంగారం, 70 తులాల వెండి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మూడు మేకలు అపహరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌కు చెందిన జంతు ప్రేమికుడు కరీం చౌశ్ మూడు మేకలను మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. తన పిల్లలుగా భావించే మేకలను ఎత్తుకెళ్లడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వాటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

నర్సాపూర్(జి): విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. మండలంలోని గొల్లమాడలో సోమవారం పంచాయతీ కార్యదర్శి లోక సంధ్యారాణి సిబ్బందితో కలిసి ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తుండగా పూసవర్ల తిరుపతి అసభ్య పదజాలంతో దూసిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

- పది రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: జాతీయస్థాయి 9వ సబ్ జూనియర్ బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అంతకుముందు పది రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వినోద్ మాట్లాడారు. క్రీడలపై యువత దృష్టి సారించాలని సూచించారు. ఆటలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతాయన్నారు. 1970లో తాను యువకుడిగా క్రికెట్ ఆడానని తెలిపారు. రంజీ ట్రోఫీ వరకు వెళ్లానని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధిగా క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుటానన్నారు. క్రీడాకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పోటీల్లో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. సాఫ్ట్ బేస్‌బాల్ రాష్ట్ర అధ్యక్షుడు, క్రీడాపోటీల నిర్వాహకుడు పి.రవికుమార్ మాట్లాడుతూ.. కార్మిక క్షేత్రం బెల్లంపల్లి క్రీడలకు ప్రసిద్ధిగాంచిన పట్టణమన్నారు. సింగరేణి కార్మికులు, యువకులు క్రీడల్లో నైపుణ్యం కనబర్చి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ఆడిన అనుభవం ఉందన్నారు. బెల్లంపల్లిలో స్టేడియం నిర్మాణానికి ఎమ్మెల్యే వినోద్ కృషి చేయాలని కోరారు.

పది రాష్ట్రాల నుంచి క్రీడాకారులు..

నేషనల్ బేస్‌బాల్ పోటీలకు పది రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు. మహారాష్ట్ర, హర్యానా, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చండీగర్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి బాలుర, బాలికల జట్లు హాజరయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువేందర్, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్, కోశాధికారి ఇమ్మానియేల్ దినకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు, జిల్లా త్రోబాల్ సెక్రెటరీ వై.బలరాం, తైక్వాండో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జిల్లపల్లి వెంకటస్వామి, అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ బి.బాబురావు, పీడీలు రాజ్‌మహ్మద్, శ్రావణ్, పద్మ, శిరీష, సీనియర్ క్రీడాకారులు ఐలయ్య, రాజం, నగేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

తెల్లబంగారం ధర తగ్గుముఖం

- ఈనెల 31 నుంచి పత్తి క్వింటాలు ధరలో రూ.50 తగ్గింపు
- క్వింటాలుకు 7,471తో కొనుగోలుకు సీసీఐ నిర్ణయం
- ఆందోళనలో అన్నదాతలు


వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయము : ఆదిలాబాద్.

పత్రికా ప్రకటన

[illegible]

సీసీఐ ద్వారా జారీ అయిన ప్రకటన

ఆదిలాబాద్‌టౌన్: మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది అన్నదాతల పరిస్థితి.. అసలే పత్తికి గిట్టుబాటు ధర లేక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న రైతులకు సీసీఐ చావు కబురు చల్లగా వినిపిస్తోంది. పత్తి నాణ్యతలో ప్రమాణాలు తగ్గాయని బీబీఎంసీడీ నుంచి బీబీ స్పెషల్‌కు మారిందని సీసీఐ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పత్తి క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521 ఉండగా ఈనెల 31 నుంచి రూ.7,471 చెల్లించేందుకు సీసీఐ నిర్ణయించింది. నాణ్యత పేరిట కోత విధించేందుకు సిద్ధమైంది. అంతర్జాతీయ మార్కెట్లో పత్తి బేల్ ధర తక్కువగా ఉండడంతో ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.7వేలకు మించి చెల్లించడం లేదు. ఇందులో తేమ పేరిట కోత విధించడంతో రూ.6,500 నుంచి రూ.6,900 వరకు మాత్రమే పత్తికి ధర లభించింది. ప్రభుత్వరంగ సంస్థ అయిన సీసీఐ రూ.7,521 మద్దతు ధర ఉన్నప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో లభించలేదు.

16,47,942 క్వింటాళ్ల కొనుగోళ్లు..

ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, జైనథ్‌లలో ఐదు మార్కెట్ యార్డులు



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి బండ్లు (ఫైల్)

ఉన్నాయి. వీటి పరిధిలో ఆదిలాబాద్, బోథ్, నేరడిగొండ, పొచ్చర, సొనాల, ఇంద్రవెల్లి, నార్నూర్, గుడిహత్నూర్, ఇచ్చోడ, బేల సెంటర్లలో 31 జిన్నింగ్ మిల్లుల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి. సీసీఐ ద్వారా ఇప్పటివరకు 15,03,368 క్వింటాళ్ల సీసీఐ ద్వారా కొనుగోలు చేయగా, ప్రైవేట్ వ్యాపారులు 1,44,573 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మొత్తం 9,29,956 క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి.

ఆందోళనలో అన్నదాతలు..


ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ నాణ్యత పేరిట మద్దతు ధరలో క్వింటాలు పత్తికి రూ.50 కోత విధించనున్న నిర్ణయంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధర పెరుగుతుందని ఇంట్లో నిల్వలు ఉంచుకున్న రైతులకు ఇది చేదు కబురే. ఏటా ఫిబ్రవరిలో ప్రైవేట్ వ్యాపారులు ధర పెంచడం అందరికీ తెలిసిన విషయమే. రైతుల దగ్గర నిల్వలు అయిపోయిన తర్వాత అధిక ధరతో విక్రయాలు జరుపుకోవడం పరిపాటిగా మారింది. మొదట్లో సీసీఐకి విక్రయించిన రైతులకు సైతం క్వింటాలుకు రూ.6,500 లభించని పరిస్థితి ఎదురైంది. తేమ శాతం ఎక్కువగా ఉండడంతో ధరలో కోత విధించారు. పత్తిని ఆరబెట్టి విక్రయించిన రైతులకు మద్దతు ధర దక్కింది. ధరను పెంచాల్సి ఉండగా నాణ్యత పేరిట కోత విధించడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సీసీఐ మద్దతు ధరలో కోత విధిస్తుందని సోషల్ మీడియాలో రావడంతో ఒకేరోజు అత్యధికంగా పత్తి బండ్లు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. సాయంత్రం 5 గంటల వరకు కొనుగోళ్లు చేయగా, ఆ తర్వాత కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతులు ఆందోళన చేపట్టడంతో జిల్లా కలెక్టర్ చొరవతో రాత్రి తిరిగి కొనుగోళ్లు జరిపారు. ఈ విషయం తెలియడంతో రైతులు మార్కెట్ యార్డుకు పత్తి బండ్లతో పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది.

ధర తగ్గించొద్దు..



ధర పెరుగుతుందనే ఆశతో చాలా మంది రైతులు ఇళ్లలో నిల్వ చేశారు. ఈ సమయంలో సీసీఐ మద్దతు ధర రూ.50 తగ్గించడం సరికాదు. అసలే దిగుబడి లేక అవస్థలు పడుతున్నాం. ధర పెంచాల్సింది పోయి నాణ్యత పేరిట కోత విధిస్తే నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం పునరాలోచించాలి.
– నర్సింగ్, పిప్పల్‌కోటి, భీంపూర్ మండలం

ఈ నెల 31 నుంచి అమలు



ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ ఈ నెల 31 నుంచి 8 శాతం తేమతో పత్తి క్వింటాలుకు రూ.7,471తో కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. నాణ్యత ప్రమాణాలు తగ్గాయని క్వింటాలుకు రూ.50 తగ్గించినట్లు సీసీఐ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని అన్నదాతలు గమనించాలి.
– మధుకర్, మార్కెట్ కార్యదర్శి, ఆదిలాబాద్

మద్యానికి బానిసై ఆత్మహత్య

ఇంద్రవెల్లి: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్ప డిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని అంజీ గ్రామానికి చెందిన గోడ్‌మలే రాహుల్ (22) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. సోమవారం మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం పంటచేలకు వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందుతాగి ఇంటికొచ్చాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినా పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



రాహుల్ (ఫైల్)